'జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం సీఎంతో చర్చిస్తా'


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

చిక్కడపల్లి: జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు అందించే విషయంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానన్నారు. మంగళవారం త్యాగరాయగానసభలో గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించే విషయంలో తన వంతు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల విషయంలో సానుకూలంగా ఉందని చెప్పారు. అనంతరం డీసీఓ రమాదేవి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కరించడంలో తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబ్ అధ్యక్షుడు నర్సయ్య, సొసైటీ అధ్యక్షుడు నర్సయ్య, సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, కోశాధికారి పి.రాంచందర్, కార్యవర్గ సభ్యులు రామారావు, భాస్కర్‌రెడ్డి, వీరేశం, సీనియర్ జర్నలిస్టులు ఆనందం, షోయబుల్లాఖాన్, బీఆర్‌కే మూర్తి పాల్గొన్నారు.

దళిత కుటుంబాలకు సంఘీభావం

చిక్కడపల్లి: ఇళ్లు కోల్పోయిన దళిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గాంధీనగర్ డివిజన్ శ్రీస్వామి వివేకానందనగర్ బస్తీలో గత నెల 29వ తేదీన అధికారులు అక్రమంగా 21 ఇళ్లు కూల్చండంతో బాధితులు చేపట్టిన నిరసన కార్యక్రమం 29వ రోజుకు చేరింది. ఈక్రమంలో మంగళవారం బాధితులు చేపట్టిన దీక్షకు ప్రొఫెసర్ కోదండరాం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా హైదరాబాద్ కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ఎం.నర్సయ్య, మెరుగు శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్, గాంధీనగర్, కవాడిగూడ కన్వీనర్‌లు రవీందర్‌యాదవ్ అజయ్, వెంకటయ్య, బాధితులు ఎంబీ కృష్ణ, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

సంకల్ప యాత్రని విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌యాదవ్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలో మార్చి 1వ తేదీన నిర్వహించనున్న బీజేపీ విజయ సంకల్ప యాత్రలో పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వల్ల దేశానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకమైన గుర్తింపు వచ్చిందన్నారు. మూడోసారి బీజేపీని గెలిపిస్తే ప్రపంచంలోనే మన దేశం మూడో అతిపెద్ద ఆర్థిక దేశంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ నేతలు సదానంద్ ముదిరాజ్, అచ్చిని రమేశ్, గౌరీ శంకర్, విద్యానంద్, ఎస్.నర్సింగ్‌రావు, ఎస్.వెంకట్‌స్వామి గౌడ్, ఎంబీ కిషోర్‌కుమార్, దేవరుప్పల రమేశ్, మేరు రమేశ్, ధర్మేందర్, రమాకాంత్ పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తప్పదు'


గౌతంరావు

కాచిగూడ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసి.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ఆరోపించారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ నేత కేటీఆర్ అహంకారానికి గుణపాఠం చెప్పినా ఆయన వ్యవహార శైలిలో మార్పు రాలేదని విమర్శించారు. అంబర్‌పేటలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. ఓట్ల కోసం మజ్లిస్‌తో చెట్టపట్టాలు వేసుకుని తిరిగిన బీఆర్ఎస్.. ఇప్పుడు మతం పేరిట రాజకీయాలు చేస్తున్నారని బీజేపీపై విమర్శలు చేయడం దుర్మార్గమని అన్నారు. అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీకి భారీ మెజార్టీ రావడం తథ్యమని గౌతమ్‌రావు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ మాటలు నగరవాసులు నమ్మలేదు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాంగ్రెస్ 420 హామీలపై పుస్తకాల పంపిణీ

అంబర్‌పేట్: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి.. బోగస్ శ్వేతపత్రాలతో కాలం గడుపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ధ్వజమెత్తారు. అందరికీ ఆరు గ్యారంటీలంటూ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించి.. ఇప్పుడు కొందరికే గ్యారంటీలంటూ కాంగ్రెస్ పార్టీ తన నిజస్వరూపాన్ని బయట పెట్టిందని మండిపడ్డారు. మంగళవారం అంబర్‌పేట చే నంబర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గ అసెంబ్లీస్థాయి సమావేశం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అబద్ధాల ప్రచారాన్ని నగర ప్రజలు నమ్మకుండా బీఆర్ఎస్‌కే ఓటేశారన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో సైతం నగర ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా ఉండాలని కోరారు. రాష్ట్రం నుంచి ఉన్న ఏకైక కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కనీసం తన సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి కూడా చేసిందేమీ లేదని విమర్శించారు. నగరంలో బీఆర్ఎస్ పార్టీ 36 బ్రిడ్జీలు కడితే.. కేంద్ర ప్రభుత్వం అంబర్‌పేట, ఉప్పల్ ఫ్లైఓవర్‌లు కడతామని ముందుకొచ్చి.. నేటికీ పూర్తి చేయలేదన్నారు. మతం అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడం బీఆర్ఎస్ పార్టీ విధానం కాదని స్పష్టం చేశారు. 14 ఏళ్ల ఉద్యమ పార్టీ 100 కి.మీ. స్పీడుతో పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపిందని, ప్రస్తుతం కాస్తా విశ్రాంతి కోసం కారు పార్టీ సర్వీసింగ్‌కు వెళ్లిందన్నారు. ఉద్యమ పార్టీ నాయకులకు పదవుల్లో న్యాయం చేస్తామని చెప్పారు. అనంతరం కాంగ్రెస్ మోసపూరిత 420 హామీలపై ముద్రించిన పుస్తకాలను పంపిణీ చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, అరికెపూడి గాంధీ, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకట రమణారెడ్డి, సీనియర్ నాయకులు రావుల శ్రీధర్‌రెడ్డి, ఎడ్ల సుధాకర్‌రెడ్డి, బి.వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం

అంబర్‌పేట్: అంబర్‌పేట్‌లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన అసెంబ్లీ స్థాయి సమావేశానికి వచ్చిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి గజమాలతో కేటీఆర్‌కు స్వాగతం పలికారు. అలాగే కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు బి.వెంకట్‌రెడ్డితో పాటు ఇతర కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, విజయకుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కె.పద్మావతిరెడ్డి, వణం రమేశ్ ప్రత్యేకంగా కేటీఆర్‌ను సత్కరించారు.



కేటీఆర్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి

పూసపల్లి కుట్ర కేసులు ఎత్తివేయాలి

న్యూడెమోక్రసీ నేత సాదినేని వెంకటేశ్వరరావు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులపై అక్రమంగా మోపిన పూసపల్లి కుట్ర కేసులను వెంటనే ఎత్తివేయాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆదివాసీ, గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం యాభై ఏళ్లుగా కృషి చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులపై పోలీసులు రాజద్రోహం కేసును నమోదుచేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పది రోజులకు పైగా కస్టడీలోకి తీసుకున్న నాయిని కొండయ్యను వెంటనే విడుదల చేయాలని, ఏజెన్సీ గ్రామాల్లో కూబింగ్‌ను తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న ఖమ్మం, వరంగల్ ఏజెన్సీ ప్రాంతాల్లో సాయుధ పోలీసు పహారాను ఉపసంహరించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుతో పాటు ప్రజలకు చేసిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ.. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన పోలీసులు, రాజ్యాంగ సంస్థలు చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల కమిషన్ కూడా ప్రభుత్వం గుప్పిట్లో ఉండటం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కె.గోవర్ధన్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జి.అనురాధ, ప్రజాగాయని విమలక్క, సీపీఎం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, సామాజికవేత్త మన్నారం నాగరాజు, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, మానవహక్కుల వేదిక జాతీయ నాయకులు ఎస్.జీవన్‌కుమార్, సజయ, గాదగోని రవి, పీఓడబ్ల్యూ నగర అధ్యక్షురాలు సరళ, పీడీఎస్‌యూ నగర కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఇంటి నుంచి పారిపోయి వచ్చి..

కాచిగూడ: ఇంటి నుంచి పారిపోయి నగరానికి వచ్చిన బాలుడిని కాచిగూడ రైల్వే పోలీసులు చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాలు.. కర్ణాటకకు చెందిన ప్రవీణ్ కుమార్(14) ఇంటి నుంచి పారిపోయి రైల్లో కాచిగూడకు చేరుకున్నాడు. బాలుడిని గమనించిన రైల్వే పోలీసులు విచారించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మంగళవారం బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

కాచిగూడ: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం నేడు(బుధవారం) సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం.వేణుగోపాల్ తెలిపారు. ప్రయాణికులు బర్కత్‌పుర డిపో పరిధిలో, బస్ స్టాపులు, బస్ స్టేషన్లు, బస్సులకు సంబంధించిన సమస్యలు, సూచనలు, సలహాల కోసం ఫోన్: 90004 06069లో సంప్రదించాలని కోరారు.

యువతకు ఆజాద్ ఆదర్శం కావాలి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ 93వ వర్ధంతిని మంగళవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్ మాట్లాడుతూ.. చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జె.రమేశ్, బాలపీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్


సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఉషా

అంబర్‌పేట్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషా శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఆరు గ్యారంటీల్లో గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి జీఓ జారీ చేయడంతో అంబర్‌పేట్‌లో సంబురాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చిత్రటానికి పాలభిషేకం చేసిన అనంతరం ఉషా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ పక్షపాతి అన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవి, ప్రసన్న, హర్షియా, షాహనాజ్, పారిజాత, సరిత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న కనకేష్ కుమార్

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ మహాత్మనగర్‌లో సత్యసాయిబాబా ట్రస్ట్ గాంధీనగర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 50 మంది పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్‌కుమార్ ఐదు కిలోల బియ్యం, పప్పు, నూనె, చక్కర, పిండి, టీపొడర్ తదితర వస్తువులు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు సీతారామరాజు, రాజ్‌గోపాల్, మదన్‌మోహన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా శివశంకర్ వర్ధంతి


నివాళి అర్పిస్తున్న వినయ్‌కుమార్, బీసీ సంఘాల నేతలు

కవాడిగూడ: దేశంలో న్యాయ వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ పి.శివశంకర్‌కే దక్కుతుందని ఆయన కుమారుడు డాక్టర్ వినయ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్గం రవీందర్ పటేల్, మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తంరావు కొనియాడారు. మంగళవారం శివశంకర్ 7వ వర్ధంతి సందర్భంగా లిబర్టీ సమీపంలోని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు సాధించినప్పుడే శివశంకర్‌కు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్, తెలంగాణ బీసీ హిందూ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ పటేల్, ప్రధాన కార్యదర్శి పర్వత సతీశ్, జాతీయ బీసీ జేఏసీ అధ్యక్షుడు సాయిని నరేందర్, మున్నూరు కాపు మహిళా పరపతి సంఘం చైర్మన్ తెప్ప అరుణ పటేల్, నాయకులు ఎల్లయ్య పటేల్, బత్తుల రామనర్సయ్య, డి.అంజనేయులు పాల్గొన్నారు.

ఎరుకల కార్పొరేషన్ కోసం విజ్ఞప్తి


కేలండర్ ఆవిష్కరించిన సుల్తాన్ యాదగిరి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎరుకల కులస్తుల అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఏకలవ్య ఎరుకల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గాంధీభవన్‌లో ప్రజాప్రతినిధులను కలిసి తమకు ప్రభుత్వంలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ విజ్ఞప్తి చేశారు. అనంతరం తెలంగాణ ఏకలవ్య ఎరుకల జేఏసీ సమావేశంలో తీసుకున్న తీర్మాణాల ప్రతులను అందజేశారు. త్వరలో భర్తీ చేయనున్న ఎమ్మెల్సీ, చైర్మన్లు, ఇతర నామినేటెడ్ పదవులలో ఎరుకలకు అవకావం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎరుకల సంఘం నూతన సంవత్సరం –2024 కేలండర్‌ను సుల్తాన్ యాదగిరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఏకలవ్య ఎరుకల సంఘం జేఏసీ వైస్ చైర్మన్లు కురాకుల కృష్ణ, రాయపురం సాంబయ్య, శ్రీరాం శివకుమార్, కేసారం ఎల్లయ్య, బుద్ద సత్యనారాయణ, కుతాటి రవికుమర్, దేవసరి కృష్ణ, బనపురం రఘు, కురాకుల మల్లికార్జున్, నల్లగొండ సమ్మయ్య పాల్గొన్నారు.

సామాజిక దృక్పథంతో సేవా కార్యక్రమాలు


విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: సామాజిక దృక్పథంతో ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తూ అల్పాహారం అందిస్తున్నారు. రాజపేల ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన అల్పాహార కార్యక్రమానికి మంగళవారం ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యాపారులు మానవత దృక్పథంతో పేద కటుంబాలకు చెందిన విద్యార్థులకు చేయూత అందించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాడం నాయకుడు సుధీర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ముప్పిడి నర్సింగ్‌రావు, గోరేబాయి, ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వరూపారాణి, ఉపాధ్యాయుడు నరేందర్‌యాదవ్, స్కూల్ కార్యదర్శి రత్నం తదితరులు పాల్గొన్నారు.

యువజన ఉత్సవాలను జయప్రదం చేయండి


ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భగత్‌సింగ్ ఆశయాలను యువతలోకి తీసుకువెళ్లేందుకు భగత్‌సింగ్ స్మారక యోజన ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువజన ఉత్సవాల సన్నాహక సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న నర్సిరెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర ఉద్యమంలో తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్ అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, డీవైఎఫ్ఐ అధ్యక్షుడు కోట రమేశ్, మహేందర్, జేకే శ్రీనివాస్, దశరథ్, కుమారస్వామి, జావేద్, లెనిన్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం తప్పనిసరి

ముషీరాబాద్: పౌష్టికాహారం తీసుకున్నప్పుడే విద్యార్థులు మానసికంగా, ఆరోగ్యంగా ఉంటారని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం హిప్నో పద్మా కమలాకర్, నవ భారతీ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ముషీరాబాద్ మానసిక వికలాంగుల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, గుడ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటి కేర్ అధ్యక్షురాలు పద్మాకమలాకర్, నాయకులు అంజయ్య గోపాలకృష్ణ, వినయ్, స్వరూపారాణి, లలిత పాల్గొన్నారు.



నేడు సైన్స్ ఫెయిర్

కాచిగూడ: నేడు(బుధవారం) పెద్దఅంబర్‌పేటలోని సత్యం టిక్నో స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు స్కూల్ చైర్మన్ గుజ్జ సత్యం, డైరెక్టర్ అరవింద్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంట నగరాలు, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనవచ్చని, ఫుడ్ ఫెస్టివల్ కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

'అట' సభలకు విజయ్‌వర్మకు ఆహ్వానం


విజయ్‌వర్మ

కాచిగూడ: నటుడు, దర్శక నిర్మాత ఉంటూ గ్రామ స్వరాజ్య ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న విజయ్ వర్మ పాకలపాటికి అమెరికా తెలుగు అసోసియేషన్(అట) ఆధ్వర్యంలో చేపట్టే సభలకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా విజయ్‌వర్మ మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం కల్పించిన అట అనిల్‌రెడ్డికి, తన పేరుని సిఫార్సు చేసిన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు రమేశ్, సాల్మన్ షానీకి కృతజ్ఞతలు తెలిపారు.

కర్నె శ్రీశైలంకు ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ప్రతినిధులు

కాచిగూడ: ఎస్సీ రిజర్వేషన్ సమితి వ్యవస్థాపకులు స్వర్గీయ కర్నె శ్రీశైలం జయంతి సందర్భంగా మంగళవారం గోల్నాక డివిజన్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సుందర్‌నగర్‌లోని భావసార్ భవన్‌లో శ్రీశైలం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. రోడ్లపై ఉన్న వృద్ధులకు, భిక్షాటన చేసుకునే వారికి ఆహార ప్యాకెట్లు అందజేయడంతో పాటు విద్యార్థులకు బుక్స్, స్టేషనరీ అందించారు. కార్యక్రమంలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి భాగ్యనగర్ అధ్యక్షుడు సుధాకర్, భానుప్రకాశ్, గజపగా నవీన్, ఎస్.మహేశ్, జి.విల్సన్, డి.అభిషేక్, సత్యనారాయణ, నిర్మల, ప్రవీణ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కవాడిగూడ: డివిజన్ పరిధిలోని దోమలగూడ తాళ్లబస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ జలమండలి అధికారులకు సూచించారు. ఈమేరకు మంగళవారం తాళ్లబస్తీలోని డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌లతో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు జి.వెంకటేశ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.ప్రభాకర్, బస్తీవాసులు, వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు భవిష్యత్తు




సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతిభ గల విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎల్అండ్‌టీ హెచ్ఆర్ అసిస్టెంట్ మేనేజర్ మణికంఠ అన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ విద్యార్థులు కూడా ప్రైవేటు రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. కళాశాల డైరెక్టర్ రిషికాంత్ మాట్లాడుతూ.. రాబోయే 15–20 రోజుల్లో మరో ఏడెనిమిది కంపెనీలు తమ కళాశాల విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శేఖర్, ఫ్యాబో సర్వీసెస్ హెచ్ఆర్ హెడ్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

చిక్కడపల్లి: అస్వస్థతకు గురైన బీఆర్ఎస్ సీనియర్ నేత ఎస్టీ అశోక్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ మంగళవారం సాయంత్రం పరామర్శించారు. కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో చికిత్స పొంది జవహర్‌నగర్‌లోని ఇంటికొచ్చిన అశోక్‌ను గోపాల్‌తో పాటు పార్టీ యువనేత జైసింహ కలిశారు. పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, ఎప్పటికప్పుడు ఆరోగ్యపరిస్థితిని తనకు తెలియజేయాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అశోక్‌కు సూచించారు. వారి వెంట పార్టీ నాయకులు రాకేశ్ కుమార్, శ్రీకాంత్, ముచ్చకుర్తి ప్రభాకర్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, సంతోష్ తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిక్కడపల్లి: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో నివసించే ఉప్పల గోపాలకృష్ణ ఈ నెల 26న ఇంటికి తాళాలు వేసి కోకాపేటలో ఉండే కుమార్తె ఇంటికి భార్యతో కలసి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున దొంగలు తాళాలు పగులగొట్టి తులం బంగారం నగలు, కొంత నగదు, సిల్వర్‌గిఫ్టులు, పాత కాయిన్‌ల దొంగిలించారు. చోరీపై బాధితుడి ఫిర్యాదుమేరకు చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య ఆధ్వర్యంలో డీఎస్సై కోటేశ్వర్‌రావు కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ కూడా కేసుకు సంబంధించిన విషయాలు సేకరించింది. దొంగలను పట్టుకునేందుకు ఎస్సైలు, పోలీసులు బృందాలుగా ఏర్పాడి సీసీ పుటేజీలను పరిశీలించారు. దీనిపై ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ ఆదేశాల మేరకు దొంగల కోసం తీవ్రంగా గాలిస్తున్నట్టు సీఐ సీతయ్య, ఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383